
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్ రాజు





## - 190 -
## అమెరిక్రిస్మస్ బహుమతి కథ

మొన్నీ మధ్య మా క్వీన్ విక్టోరియా ఒక సాధారణమైన అసాధారణమైన కోరిక కోరింది.

"నువ్వు వస్తావా, నన్ను ఒక్కర్తినీ వెళ్ళమంటావా?" అనేదే ఆ కోరిక.

మామూలుగా అమెరికూరలు కొనుక్కోడానికైతే "నువ్వే వెళ్ళు" అని నేను ఏం కొనకూడదో ఒక లిస్టూ, ఏం కొనకుండా ఇంటికి వస్తే నడ్డి మీద చంపేస్తుందో మరొక లిస్టూ నా చేతిలో పెడుతుంది ఆవిడ. అదే మా ఇంటికి దగ్గర లోనే ఈ మధ్య వెలిసిన శారదాంబ గుడికి అయితే "అక్కడికి నువ్వెందుకులే. దేవుడు చిన్నబోతాడు" అని తనే వెళ్ళిపోతుంది.

ఈ తతంగాలన్నింటికీ మూలం డ్రైవింగ్ అనమాట. కేవలం తను మాత్రమే వెళ్ళదల్చుకున్న దగ్గర చోట్లకి మాత్రమే తను డ్రైవింగ్ చేయును. మిగతా 90 శాతం అన్ని చోట్లకీ...ముఖ్యంగా ఫ్రీ వే మీద వెళ్ళే చోట్లకీ, పార్టీలకీ, డాక్టర్ల దగ్గరికీ నేనే ఇంటి డ్రైవర్ని.

అలాంటిది ఇవాళ నన్ను "నువ్వు వస్తావా?" అంటే అర క్షణం అపార్థం చేసుకుని భయపడినా, ఆవిడ కొంచెం సింగారించుకుని, జోళ్ళు కూడా వేసేసుకుని అలా అడిగిందీ అంటే ఇందులో ఏదో తిరకాసు ఉంది అని అర్థం అయింది.

నా నోరు పెగిలే లోపుగా "మామూలుగా అయితే నేనే వెళ్తను. కానీ అది ఆ దిక్కుమాలిన ఫస్ట్ కాలనీ షాపింగ్ మాల్ మధ్యలో ఉంది. వెధవ పార్కింగ్ దొరకదు. వెతుక్కుంటూ వెళ్ళడానికి ఓపిక లేదు. అందుకూ నిన్ను రమ్మంట" అని సంజాయిషీ ఇచ్చింది మా మహారాణి.

"ఓ అదా. ఇంతకీ ఏమిటా షాపు?" అని అడిగాను కుతూహలం పట్ట లేక.

"అదంతా నీకెందుకు?. వస్తావా, రావా? నేను ఎక్కడైనా తప్పిపోతే నిన్నే పిలుస్తాను మరి".

అంటే తను దారి తప్పిపోవడం తప్పని సరి కాబట్టి అప్పుడు బదులు ఇప్పుడే నేను ఆ డ్రైవింగ్ చేసి ఆ మాల్ కి తీసుకెళ్ళాలి అని అర్థం అయి బయలు దేరాను. ఎప్పటి లాగానే కారు ఎక్కగానే ఎక్కడికీ పారిపోయే పరిస్థితి లేదు కాబట్టి ప్రైవేటు క్లాస్ మొదలయింది. ఈ సారి పాఠ్యాంశం 'ఆడువారూ, సింగార ఆవశ్యకతా" మరియు "మగాడు ఎలా ఏడిసినా

పరవా లేదు". అసలు ఈ రోజు తను చెయ్యదల్చుకున్న షాపింగ్ సారాంశానికి ఇది ఉపోద్ఘాతం అని అక్కడికి వెళ్ళాక తెలిసింది.

కారు దిగి ఆ దుకాణం లోకి అడుగుపెట్టే ముందే "ఇదిగో, నీ క్రెడిట్ కార్డ్ ఇలా తగలెయ్" అంది క్వీన్ విక్టోరియా.

ఇద్దరం కలిపి ఎక్కడికైనా వెళ్ళినప్పుడు ఇది కూడా మాకు అలవాటే అయినా సరదాకి "ఎందుకూ?" అన్నాను.

"ఎందుకేమిటి, నా మొహం. అందుకే. లేకపోతే ఉట్టినే ఆ వీసా కార్డ్ ఎలా ఉంటుందో చూసి తరిద్దామనా?' అని విసుక్కుంటూ నా క్రెడిట్ కార్డ్ లాగేసుకుంది. తన క్రెడిట్ కార్డ్ దాచేసుకుంది.

తను ఎక్కడికి వెళ్ళాలో ఆ కొట్టు పేరు సెఫోరా ట. నేను ఇదివరకూ ఎప్పుడూ ఆ పేరు విన లేదు.

నా మొహం చూడగానే 'అది ఆడవాళ్ళ స్టోర్ లే. సింగారం సరుకులు దొరుకుతాయి. అందుకే నీకు తెలీదు" అని మళ్ళీ సంజాయిషీ ఇచ్చింది రాణీ గారు.

ఆవిడ ఊహించినట్టుగానే పార్కింగ్ కోసం కాస్త కష్టపడి, మొత్తానికి ఇద్దరం ఆ సెఫోరా అనే షాపులో అడుగుపెట్టాం. అది నా జన్మలో ఒక అపురూపమైన అనుభవం. జిగేల్ జిగేల్ మని దేదీప్యమానంగా వెలిగిపోతూ, సువాసనలు వెదగక్కుతూ, వందలాది రంగు రంగుల వస్తువులు, సీసాలు తళ తళ లాడుతూ, వందలాది యుక్త వయసు నుంచి చక్రాల కుర్చీల దాకా అన్ని వయసుల మహిళా మణులతో కిట కిట లాడిపోతున్న ఆ దుకాణంలో నేనొక్కడినే మగ పురుగుని...కారు డ్రైవర్ని. ఇక ఆ దుకాణంలో ఇలా ఇద్దరం అడుగు పెట్టామో లేదో, నేను ఏకాకిని అయిపోయాను. ఎందుకంటే మా క్వీన్ విక్టోరియా రయ్ రయ్ మని ఎక్కడికో దూసుకు పోయింది. ఐతే నాకు ఇదేమీ కొత్త కాదు. మేమిద్దరం ఏ రకమైన షాపింగ్ కి...వాల్ మార్ట్ నుంచి, కూరల దుకాణం దాకా ఎక్కడికి వెళ్ళినా.....ఆవిడకి ఆవేశం తన్నుకొస్తుంది. గబగబా, అవసరం ఉన్నా లేక పోయినా ఆ షాపులో ఉన్న పాతిక నడవలు.. వరసలూ..వరండాలలో చటుక్కున మాయం అయిపోతుంది. గంట అయ్యాక ఎక్కడో ఇద్దరం తారస పడి "ఏమండీ, ఎలా ఉన్నారు?, ఏమిటి, షాపింగ్ కి వచ్చారా?" అని పలకరించు కుంటాం. అక్కడికి షాపింగ్ కి రాక పెళ్ళి చూపులకి వస్తామా ఏమిటి?

ఇక ఈ సెఫోరాలో నేను వెతుకులాట మొదలుపెట్టాను. నిజానికి అంత మంది అమ్మాయిల మధ్య నేనొక్కడినే తారట్లాడడం సరదాగానే ఉన్నా, కాస్త బెరుగ్గా కూడా ఉంది. కానీ అదేమిటో కానీ ఎవ్వరూ నన్ను పట్టించుకోనే లేదు....ఆఖరికి సేల్స్ అమ్మాయిలు కూడా నన్ను దారి తప్పిన వాడిలాగానే 'అయ్యో పాపం" అన్నట్టుగా చూడడం మొదలుపెట్టారు. ఇక నా మహారాణీ వేటలో భాగంగా మొదటి షాపింగ్ నడవలో దృష్టి సారించగానే అక్కడ వరసగా ఇంద్రధనుస్సులో ఉన్న రంగులూ, వాటిని ఒకదానికి మరొకటి కలిపినప్పుడూ, ఒక్కొక్కదానిక్కీ మరొకటో, రెండేసే కలిపీకలపనట్టుగా రంగరిస్తే వచ్చే రంగూ, వీటిని మైదా పిండి లోనో మరేదైనా పదార్ధం లోనో కలిపి, దాన్ని ఒక చిన్న గొట్టంలో కుక్కి, లిప్ స్టిక్ అనే పేరుతో ఉన్న సుమారు వెయ్యికి పైగా పెదాల సౌందర్యం ఇనుమడింపచేసే రంగు రంగుల

గొట్టాల మధ్య మా క్వీన్ విక్టోరియా కనపడ లేదు. కానీ తన పెదాలకి ఏ రంగు వేసుకుంటే వాటిల్లో ఉన్న అవకతవకలు కప్పి పోయి ఆకర్షణ పెరుగునో అది వేసి సాంపుల్ గా చూపించుటకు కేవలం డా.9.99 మాత్రమే అని బోర్డు మెడకి వేళ్లాడేసుకున్న అమ్మకం అమ్మాయిలు ముగ్గురు మహా బిజీగా కనపడ్డారు. వాళ్ళని బ్యూటీషియన్స్ అంటారుట. అలా ఒక వీర వనిత తన పెదాలకి నలుపూ, తెలుపూ, పసుపూ కలిసిన ఒకానొక రంగు అద్దించుకుని మురిసిపోవడం చూసి నేను మురిసిపోయాను.

ఇక రెండో నడవ లోకి వెళ్ళగానే "కాలె & గ్రీన్ టీ, స్పినాచ్ విటమిన్స్" 'అందరికీ  యువత కోసం" అని రాసి ఉన్న అనే సొగసైన గాజు సీసాలో ఒక పదార్థం కనపడింది. ఖరీదు "కేవలం $19.99 మాత్రమే". ఆ పదార్థం చూడడానికి ద్రవ పదార్థంలా ఉంది కానీ దాన్ని ఆ సీసా మూతలో వేసుకుని మందు లాగ తాగాలా, లేక వేలికి పూసుకుని శరీరంలో ఎక్కడైనా రాసుకోవాలా, లేక అర చేతిలో పోసుకుని వళ్ళంతా పులుము కోవాలా నాకు ఏమీ అర్థం కాలేదు. ఎవరినైనా అడుగుదామా అంటే దాం దుంపతెగ...చెట్టంత మగాడిని. మరి అహం అడ్డు రాదూ...అంచేత ఎవరూ గమనించకుండా ఎంతో సహజంగా ఆ సీసాని బయటకి లాగి వెనక వేపు తిప్పి అక్కడ అతి చిన్న అక్షరాలతో దాచిన రహస్యాన్ని కనిపెట్టేశాను. ఆ పదార్థం జుట్టుకి కావలసిన విటమిన్స్ కోసం ట. విటమిన్స్ అన్నాడు, పైగా అందులో ఉండే మూల దినుసులు కాలె అనే ఆకు కూర, తోటకూర ఆకు, గ్రీన్ తేయాకు కదా అనుకుని మనం నోట్లో వేసుకుని చప్పరించకూడదు ట.  అలా చప్పరిస్తే నాలిక, మింగితే లోపల చిన్న ప్రేవులు, పెద్ద ప్రేవు కాలి, కరిగి పేలి పోతాయిట...కేవలం జుట్టుకి మాత్రమే రోజుకి అర చెంచాడు చొప్పున పట్టించి, గంట సేపు ఎండలో కూచుని ఆరబెట్టాలి ట. ఇక అసలు సిసలు రహస్యం....అది కేవలం మహిళలకు మాత్రమే....ట. పురుషులు జుట్టుకు దట్టించిన పిమ్మట దట్టించుటకు ఆ ద్రవము ఉండును కానీ జుట్టు ఉండదు ట. దాని పక్కనే మరొక సొగసైన పేకెట్, దాని మీద 'గుడ్ కర్మ హైర్ ప్రోడక్ట్స్"...అనగా ఈ ఒక్క పేకేట్ మాత్రమే కాదు....జుట్టుకి కావలసిన సకల పదార్థాలూ తయారు చేసే కంపెనీ వారి వస్తువులు అనమాట. అవి 'సిలికోన్ ఫ్రీ. కలర్ సేఫ్, క్రుయెల్టీ ఫ్రీ" ..అనగా వాటిలో ఇసుక ఉండదు, ఏ రంగు జుట్టు వాళ్ళు అయినా వాడ వచ్చును,‐‐‐హింసా లేనిది...అంటే అది రాసుకుంటే, పూసుకుంటే దురద పుట్టదు అని అర్థం. అవి కొనుక్కోని వాడి ఖర్మ. కొనుక్కుంటే కర్మ. ఇదంతా చదవగానే నాకు చెమట్లు పట్టేసి, వచ్చిన పని మర్చి పోయాను..అదే మా క్వీన్ విక్టోరియాని వెదకడం.

ఇక మూడో నడవ లోకి ప్రవేశించగానే గుప్పున పరిమళ సుగంధ ద్రవ్యాల సువాసన మరింత గుబాళించింది. అహా, మనం కునేగా మరికొళుందు డిపార్ట్ మెంట్ కి వచ్చేశాం అని అర్థం అయిపోయింది. ఇక్కడ సీసాలు అతి చిన్నవే కానీ ఖరీదులు అతి పెద్దవి. ఇక్కడ తమాషా ఏమిటంటే...మహిళల పెర్ ఫ్యూమ్ లు 1016 రకాలు, అబ్బాయిల మాత్రమే కొట్టుకునేవి 332 రకాలు, మధ్య రకం వారికి ఏకంగా 557 రకాల సువాసనలు దొరుకుతాయి అని అక్కడ ప్రకటనలో

చూసి విస్తుపోయాను. వాటి పేర్లు మహాకవి శ్రీశ్రీ కి కూడా అంతుపట్టవు. సెంటు పిచ్చి ఉన్నవాళ్ళకి ఈ దుకాణం స్వర్గధామమే. రోజంతా అక్కడే ఉండిపోవచ్చు.

ఇక మరొక నడవలో ఇరవై మంది లైన్ లో నుంచుంటే ఏమైనా బిళ్ళలూ, చాక్ లెట్లూ ఇస్తున్నారేమో అని నేనూ నుంచోగానే మిగతా ఆడంగులు నాకేసి అదోలా చూశారు. ఆ లైన్ అంతా "కంటి కొరడా దెబ్బలు" కోసం ట. అనగా అక్కడ బ్యూటీషియన్ కేవలం $19.99 కి కనుబొమ్మలు తీర్చి దిద్ది, వాటికి ప్లాస్టిక్ రెప్పలు...అంటే ఐ లాషెస్ పెడతారుట. ఈ 'ఐ లాషెస్' కి తెలుగులో ఏమంటారో అని గూగులమ్మని అడిగితే "కంటి కొరడా దెబ్బలు" అని చెప్పింది మరి. ఈ వయసులో నాకు ఈ దెబ్బలు అవసరమా అని నేను పక్కకి తప్పుకున్నాను.

ఇక క్వీన్ విక్టోరియా వేటలో కనపడిన మరొక నడవ "వయో నిరోధక పరిష్కారాలు"..అనగా....anti-aging solutions. అందులో ఒక గోడ వేపు 'మగవారికి', రెండోది 'మహిళలకి' అని కనపడింది. ఆ చర్మ సౌందర్య సబ్బులు, తోలు ముడత పడకుండా ఆపు ద్రవ్యములు, చర్మము తళతళ, నిగనిగ మెరిపించు తైలము, రాలిన జుట్టు తిరిగి అతికించుకొను జిగురు.....మొదలైనవి మనకి అక్కర లేదు కదా ఆ నడవలో అడుగు పెట్ట లేదు.

ఇంతలో నా సెల్ ఫోన్ కుయ్యో మొర్రో అని మోగింది. దాని అర్థం నాకు తెలుసు...అంటే....నా క్రెడిట్ కార్డ్ ఎక్కడో వాడబడినట్టు శుభవార్త అనమాట. అవును కదా....నేను ఎక్కడా వెతకక్కర లేదు. ఆ సేల్స్ కౌంటర్ దగ్గరకి వెళ్తే చాలుగా...ఆవిడ ఏయే వస్తువులు కొన్నా అక్కడికే కదా వెళ్ళేది అని బుర్రకి తట్టి ఆ దుకాణంలో ఒక మూల ఉన్న సేల్స్ బల్ల దగ్గరకి వెళ్ళాను. అక్కడ సుమారు యాభై మంది ఏవేవో కొనుక్కోడానికి వరసలో నుంచుని ఉండగా మా క్వీన్ విక్టోరియా మటుకు అందరినీ దాటుకుని ఎలా వెళ్ళిందో కానీ ఆ బల్ల దగ్గర నగదు కౌంటర్ దగ్గర నా క్రెడిట్ కార్డ్ ఎడాపెడా ఊపుతూ కనపడింది. దూరం నుంచి ముందు చూడగానే ఆ కౌంటర్ దగ్గర ఆ కార్డ్ తీసుకుంటున్నది అమ్మాయి అనుకున్నాను. తీరా కాస్త దగ్గరగా వెళ్ళి చూసినప్పుడు 'అబ్బే, అబ్బాయేలే" అనిపించింది. తీరా బాగా దగ్గరగా మా క్వీన్ విక్టోరియా పక్కకి వెళ్ళి చూడగానే నా క్రెడిట్ కార్డ్ తన మెషీన్ లో పెడుతున్నది అమ్మాయీ కాదు, అబ్బాయీ కాదు, మరేదో అదిలా కనపడెను. ఎందుకంటే సదరు మోహానికి ఆ షాపులో అమ్ముతున్న అన్ని మేకప్ సామాగ్రీ వేసేసుకుని అక్కడ నిల్చుని మాట్లాడుతున్న ఆ ఆరడుగుల సజీవ పదార్థాన్ని ఏమనాలో తెలీ లేదు. కళ్ళకి సుర్మా, వాటికి కొరడా దెబ్బలు, పై పెదవి ఉండే చోట ఒక రంగు, కింద పెదవి మరొక రంగు... ఎరుపు, నీలం, తెలుపు అమెరికా జాతీయ జెండా రంగులేమో జుట్టుకి, బుగ్గల మీద దట్టించిన పంచ రంగుల పౌడరు....చేతుల మీద అంతా పచ్చ బొట్లు....చెప్పనలవి కాని ఆ భూత, ప్రేత పిశాచి చేతిలో నా క్రెడిట్ కార్డ్ రెపరెప...

మొత్తానికి ఒక రకమైన షాక్ లో ఆ షాప్ నుంచి కారులోకి వచ్చి పడ్డాక అప్పుడు సెల్ ఫోన్ లో చూస్తే మొత్తం క్రెడిట్ కార్డ్ బిల్లు $399.99....అయ్య బాబోయ్....అంత డబ్బుకి ఆవిడ చేతిలో ఏదో ఒక గోనె సంచీడు అంత సామాగ్రి

ఉంటుందేమో అని తీరా చూస్తే ఆవిడ చేతిలో చిన్న చేతి సంచీ..అందులో నాలుగో, ఐదో సీసాలు. కుతూహలం పట్ట లేక మా క్వీన్ విక్టోరియా చూడకుండా....ఆ సంచీ లోంచి చేతికి అందిన సీసా ఒకటి బయటకి తీశాను. అదే..."కాలె & గ్రీన్ టీ, స్పినాచ్ విటమిన్స్"...రెండు సీసాలు.

ఇంటికి వెళ్ళాక , గంట పోయాక ఆవిడ 'ఇదిగో. జుట్టు ఆరబెట్టుకోడానికి తోటలో బెంచీ మీద ఉంటాను" అని అనగానే అప్పుడే కొన్న ఆ జుట్టు విటమిన్స్ ఆ తలకెక్కింది అనమాట అనుకుని, అదే అదను కదా ఆ సెఫోరా సంచీలో అంత ఖరీదు వస్తువులు  ఇంకేం ఉన్నాయా అని వెతికేశాను.

ఆ సంచీ లో ఒక క్రిస్మస్ కార్డ్.....దాని మీద "నీకు నా క్రిస్మస్ మరియు నూతన సంవత్సరానికి తన బహుమతి" ఇట్లు..అని తన పేరు అని రాసి ఉంది...తనకి మటుకు ఏమీ లేవు. ఏం చెప్పమంటారు?

**COMMENTS**